


***(దశాబ్దాల క్రిందటి తెలుగు వారి జీవన విధానాలకు అద్దం పట్టిన సరదా కబుర్ల సమాహారం)***

83

(11 ' సెప్టెంబర్ 72 - ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)

**నాకు మల్లేనే** ఉద్యోగంలోనుంచి బయటపడి రికామీగా తిరుగుతున్న మిత్రుడు తరుచు కలుసుకుంటున్నాడిటీవల వచ్చి. రికామీగా ఉన్నా, హుషారుగా ఉండగలడు. కొంచెం ఆస్తివున్నమాట నిజమే గాని - దానినుంచి వచ్చిన హుషారు కాదది.

అతనికి దిగులుపడటం చేతగాదు. పొగడ్తలకోసం ఎదురుచూడడు ప్రొద్దు ఎలా గడుస్తూందా అన్న భయంలేదు. పరోపకారబుద్ధి వుంది బంధు ప్రీతి వుంది. ఇంకేం కావాలి? హాయిగా కాలంగడిపేస్తూ ఉంటాడు.

"ఏం శేషూ! రేపు సాయంత్రం కలుసుకుందామా! " అంటే

"ఎన్నిగంటలకు? సరిగ్గా అయిదుగంటలా! సరే వచ్చేస్తాను" అంటాడు.

"ఆరు గంటలకు ఫలానా చోటికి వెడదాం?" అంటాననుకోండి.

"వెడదాం ఎంతసేపు?" అంటాడు.

"ఏడున్నరకు ఇంటికి రావాలి" అంటాను.

"ఏడుంబావుకేవద్దాం మనదేం ఉంది?" అని నవ్వుతూ అనేస్తాడు.

"ఊళ్ళో ప్రయాణాల మాటకాదు. బయట ఊళ్ళ ప్రయాణాలమాట చెప్పినా అంతే. మనం ముసలివాళ్ళమైనాం. పోనీ ఏ హైదరాబాదో చేరి కాలం గడిపేద్దాం వృద్ధసంఘం ఒకటి స్థాపిద్దాం అక్కడ" అంటే -

***ఆకులలాగా ఉన్నాం... ఎప్పుడు రాలిపోతామో***

"అలాగే చేద్దాం. తొందరగా చేస్తే మంచిది ఎన్నాళ్ళదాకానో దేనికి? పైవారం బయలుదేరుదాం ఎండు ఆకులలాగా ఉన్నాం. ఎప్పుడు రాలిపోతామో" అని పకపక నవ్వుతాడు.

అతగాడు ఎండు ఆకు అన్నప్పుడల్లా హృదయంలో ఫెళఫెళమన్న శబ్దం వినిపిస్తూంది. మామూలు సమయాలలో అరవై అంటే అంత పెద్ద వయస్సనిపించదు. డెబ్బయి దాటినవాళ్ళు కూడా రుబ్బుపత్రాల్లాగా తిరుగుతూ ఉంటారు. పైవాళ్ళు ఉంచితే ఉద్యోగాలు చేస్తూ తెల్ల మీసాలు మెలివేస్తూ ఉంటారు.

పైగా కలం చేతపట్టినా, ఎవరినో కూర్చోపెట్టుకుని పోసుకోలు కబుర్లు చెపుతున్నప్పుడూ మనస్సు మాములుగా, పచ్చగా ఉన్నట్లే ఉంటుంది. ఆరోగ్యాన్ని గురించి ఆలోచిస్తున్నా, సంపాదన విషయంలో లెక్కలు వేస్తూన్నా.. వేదాంతంలోకి మనస్సు పోనిచ్చినా అధిక ధరల్ని గురించి ఆలోచించినా, సంఘంలో తలయెత్తే కృతచర్యలు తెలుసుకోగలిగినా బ్రతుకు ఎండు ఆకుగా మారిపోయినట్లే అనిపిస్తుంది.

కొన్ని ఆకులు రాలిపోతే భగవంతుడికి జాలివుండదు. సంఘానికి లోటు ఉండదు.

ఈ రోజుల్లో అయినవాళ్ళక్కూడా అట్టే విచారం ఉండటంలేదు అన్నీ తెలిసి కూడా ఆశలు పెంచుకునే వారిని తలిస్తేనే విచిత్రంగా ఉంటుంది.

ఒక వృద్ధమూర్తిని "తమ కోరిక యేమిటి? జీవితంలో సాధించదలిచిందేమిటి? " అని ప్రశ్నించాను. ఆయనగారు పది నిముషాలు అటూ ఇటూ చూచి, "ఆ సమస్యను గురించి ఆలోచించడం మంచిదే. అయితే పై ఆదివారం వస్తా" అని హఠాత్తుగా లేచిపోయాడు.

ఆదివారాలు ఆరు గడిచినాయి. ఆయనగారి దర్శనం మాత్రం కాలేదు.

***నరకంలో హౌస్ ఫుల్ బోర్డు.***

మొన్న మిత్రులు పుచ్చా పూర్ణానందంగారు మరో సమవయస్కునితో చలోక్తులాడుతూ "అప్పుడే మనకు ఛాన్సు రాదు అక్కడ హౌస్‌ఫుల్ బోర్డు పెట్టేశారంట. అయినా ఇంకో తమాషా విన్నారా? అక్కడ చోటు చాలకపోవడం వల్లనే అక్కడ వేసే శిక్షల్ని కొద్దిగా రూపాలు మార్చి ఈ లోకంలోనే అమలు జరుపుతున్నారు. అందువల్ల పిలుపులు కొంచెం ఆలస్యమవుతున్నాయి."

"ఇక్కడ సిగరెట్లన్నా దొరుకుతున్నాయి. అక్కడ అవీ ఉండవు" అన్నాడు రెండో పెద్దమనిషి.

"నాకు బీడీలు అలవాటు అవి దొరుకతాయేమో" అనుకున్నాడింకో ఆయన.

"అంతా నరకం మాట ఎత్తుతావేమిటి? అన్ని పాపాలు మనమేం చేశాం? పెద్ద ఉద్యోగాల్లో చేరి క్రిందివాళ్ళ నోళ్ళు కొట్టివేశామా? లంచాల పొట్లాలు చూడగానే సంతకాలు పెట్టేశామా? మరొకరికి మేలు జరుగుతుంటే సహించలేక, గుండెల్లో ఎర్రతేలు కుట్టినట్లు ఏడ్చామా? మనమేం పాపం చేశాం? మనకు నరకం ప్రాప్తించడానికి. సరాసరి స్వర్గానికే పోతాం" అన్నారు పూర్ణానందంగారు.

***రంభా, ఊర్వశీ ముసలివాళ్ళయ్యారట***

"అక్కడ అసలు ఖాళీలేదుటండీ. పూర్వం ధర్మాలు చేసినవాళ్ళూ, యజ్ఞయాగాదులు చేసినవాళ్ళూ అక్కడ చేరేవారుట. ఇప్పుడు రాజకీయాలద్వారా దేశానికి సేవచేసిన వారికి మాత్రమే ప్రవేశార్హత పెట్టారుట. అందువల్ల స్వర్గం క్రిక్కిరిసిపోతోందిట. పైగా రంభా, ఊర్వశీ మొదలైన వాళ్ళంతా బొత్తిగా ముసలి వాళ్ళయిపోయారట. స్వర్గవాసుల్ని పలకరించే ఓపికైనా లేకుండా ఒక మూల ఎక్కడో పడివున్నారుట. గృహాన్నే స్వర్గసీమ చేసుకుని ఇక్కడే ఉండటం శ్రేయస్కరం" అన్నారు రెండో ఆయన.

"ఏం గృహమో? ఏం స్వర్గమో? ఇంతవరకు ఈ నెల యింటి అద్దే కట్టలేదు" అని రెండో ఆయన గొణుక్కున్నారు.

"అలా అంటే ఎలాగండీ? పురుషులుగా జన్మించిన తర్వాత ఇంటి కడగళ్ళు తప్పుతాయా? మన వేదాంత మాటలు ఇతరులు వొప్పుతారా? పురుషుడైన తర్వాత తురుపులాగా పనిచెయ్యాలిగాని విషాదంతో కూర్చుంటే ఎలా?"

"అయినా ఇంకో సత్యం ఉంది మీరు గ్రహించవలసింది. ఈ కడగళ్ళున్నాయి చూశారూ! ఇవి చాలాకాలం భరించాం. ఇక భరించవలసిన కాలం చాలా తక్కువ. అది ఆలోచించరేం మీరు. "

***కడగళ్ళ ముసురులో వడగళ్ళవాన.***

"అయినా జీవితమంటే కడగళ్ళే.. అందులో ఈ కాలంలో ఈ కడగళ్ళ ముసురులో నుంచి ఎప్పుడో సుఖమనే వడగళ్ళవాన కురుస్తుంది. దానికోసం ఆశపడి కూర్చోవలసిందే" అని ఆయన దీర్ఘోపన్యాసం చేశారు.

మళ్ళీ శేషగిరి అన్నాడు - "మీరెన్ని మాట్లన్నా చెప్పండి మనం ఇక్కడవుండటమనేది హుళక్కి. ఒక చిన్నగాలికి రాలి ఊరుకుంటాం. ఈ గాలి ఎప్పుడు వీస్తుందో మనకు తెలియదు గనుక ఇలా గోల జీవితంలోపడి కొట్టుకుంటూ ఉంటాం" అని.

పూర్ణానందంగారు నవ్వి "అలా కొట్టుకు పోవడమంటూ లేకపోతే మనంటి సరుకు ఈ లోకంలోకి ఎందుకు వస్తుంది? ఏ ఇక్ష్వాకులో ఇంకా పరిపాలిస్తూనే ఉండేవారు. భారతదేశ ప్రతిష్ట నిలబడేది. మీవంటి రకాలు ఎందుకొస్తాయండి" అన్నారాయన.

***జీవితం టైమ్ ఎండు వర్కు లెక్కలాటిది.***

"బయటికి వెళ్ళకపోతే ఎలాగండీ? వెళ్ళి తీరాలి. జీవితం కూడా టైం ఎండ్ వర్కు లెక్కలాటిదే ఈ ప్రపంచం ఒక తొట్టి. పైనుంచి జీపులు వచ్చి నింపుతూ ఉంటారు. క్రింద జనప్రవాహం జారిపోతూ ఉంటుంది భూమిలోకి. లేకపోతే తొట్టి ఎక్కడ పడుతుంది? కాకపోతే ఇప్పుడు ఫామిలీ ప్లానింగ్ ద్వారా తొట్టిలోకి వచ్చే ప్రవాహాన్ని తగ్గించారు" అన్నాను.

"పోక ఏం చేస్తామండీ? అందరం పోతాం. ఉండి ఉద్ధరించేదేం వుంది? ఉన్నన్నాళ్ళూ ఇలా కొట్టుకుంటాం. కళలు, సారస్వతం అంటూ కళాసేవచేసేవారు మాత్రం కలకాలం ఉంటారా? అలావుంటే కాళిదాసాదులే ఉండేవారు. దేశమంతా ఇలాటి కాఫీదాసులు, సిగరెట్ల దాసులూ ఎందుకు అవతరిస్తారు? " అన్నారు పూర్ణానందంగారు.

అన్నట్లు మొన్న వేసవికాలం గడిచిన తర్వాత అంటే మేనెల వెళ్ళిన తర్వాత ఎప్పటికో ఉషశ్రీగారు ఏ ఊరునుంచో ఊడిపడ్డారు. రాగానే ఆయన వేసిన ప్రశ్న "ఏమిటి బ్రతికి ఉన్నారా?" అని.

"ఆ! ఇలా ఉన్నాం ఫర్వాలేదు. వేసవికాలం గడిచింది. మళ్ళీ వేసవికాలంలాగాలంటే ఇంకో పదినెలలదాకా ఫర్వాలేదు. తర్వాత మాట చెప్పలేం" అన్నారు.

***ఎప్పుడో ఒకప్పుడు ఆకులు రాలక తప్పదు.***

ఆ మాట వినగానే ఉషశ్రీగారు అన్నారు. "మరేం ఫర్వాలేదు ఈ వేసవికాలానికి తట్టుకున్న ఘటాలు మరో పదేళ్ళదాకా చక్కగా బ్రతుకుతారు. అంతవరకూ నాది గ్యారంటీ అని. "

ఆ గ్యారంటీని జ్ఞాపకం చేసుకొమ్మని చెప్పాను వృద్ధమిత్రులకు. శేషగిరి మాత్రం "ఎప్పటికో అప్పటికి ఆకులు రాలితీర్తాయి" అన్నాడేదో పెద్ద సత్యాన్ని వెలిబుచ్చినట్లు.

Post your comments